క్లుప్తంగా

ఆధ్యాత్మిక భావాలు పెంపొందించుకోవాలి



గోదాన పూజకు హాజరైన మాజీ ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి దంపతులు

పెదపూడి: ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక భావాలు పెంపొందించుకోవాలని మాజీ ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి అన్నారు. అనపర్తి మండలం పొలమూరు గ్రామానికి చెందిన సత్తి రామకృష్ణారెడ్డి దంపతులు బుధవారం గోదాన మహోత్సవం నిర్వహించారు. కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి దంపతులు హాజరయ్యారు. పూజల్లో కూర్చున్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు సత్తి గీతావరలక్ష్మి, సత్తి వెంకటరెడ్డి, ఉప సర్పంచి సత్తి సూరారెడ్డి, వైఎస్సార్ సీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

షష్ఠి ఉత్సవాలకు రాట ముహూర్తం



ఉత్సవాలకు రాట ముహూర్తం చేస్తున్న ప్రముఖులు

రాజానగరం: స్థానిక రావుల చెరువు గట్టున కొలువైన వల్లీదేవసేనా సమేత సంతాన సుబ్రహ్మణ్యేశ్వరుని 98వ షష్ఠి ఉత్సవాలు వచ్చే నెల 7 నుంచి 11 వరకు జరగనున్నాయి. ఈ ఉత్సవాల నిర్వహణకు శ్రీకారం చుడుతూ ఆలయ ప్రాంగణంలో నిర్వాహకులు బుధవారం రాట పాతి, పనులను ప్రారంభించారు. ఐదు రోజుల పాటు జరిగే ఈ ఉత్సవాలలో భక్తులను అలరించే విధంగా వివిధ సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించిన వివరాలను ఉత్సవ కమిటీ పెద్దలు కంకటాల సత్తిపండు విలేకరులకు వివరించారు. కార్యక్రమంలో నిర్వాహకులు మండవల్లి వెంకన్న బాబు, సముద్రాల రాంబాబు, గ్రంధి నానబ్బులు, కంకటాల మహేష్, శ్రీనివాస్, గ్రంధి సత్తిబాబు, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బాలలతో పని చేయించడం నేరం



రాజానగరంలో దుకాణాలను తనిఖీ చేస్తున్న అధికారులు

రాజానగరం: దుకాణాలు, గృహాలు మున్నగు వాటిలో 18 ఏళ్ల నిండని బాలలచే పనులు చేయించడం చట్ట రీత్యా నేరమని అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ ఎం.లలితకుమారి అన్నారు. ఈ నిబంధనలను ఉల్లంఘించి పిల్లలతో పనులు చేయిస్తుంటే సంబంధిత యజమానులపై కేసులు నమోదు చేస్తామన్నారు. వారిపై చట్ట రీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ మేరకు బుధవారం రాజానగరంలోని వివిధ దుకాణాలు, హోటళ్లనుతనిఖీ చేశారు. ఆయన వెంట హెడ్ కానిస్టేబుళ్లు ఎం.విజయ్‌కుమార్, ఎండీ ఆలీ, క్రాఫ్ట్ జిల్లా కో ఆర్డినేటర్ బి.రాజ్‌కుమార్, పద్మ తదితరులు ఉన్నారు.

డిసెంబర్ 27న ప్రకృతి వ్యవసాయంపై సదస్సు

రాజానగరం: ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన కల్పించడానికి డిసెంబర్ 27న దివాన్ చెరువులోని డీవీబీ రాజు లేఅవుట్‌లో సదస్సు నిర్వహించనున్నారు. విజయరాం ఆధ్వర్యంలో జరిగే ఈ సదస్సులో పద్మశ్రీ సుభాష్ పాలేకర్ ప్రకృతి వ్యవసాయంపై రైతులకు శిక్షణ ఇవ్వనున్నారు. ఇందుకు సంబంధించిన ఇతర వివరాలకు 93461 77044 నంబర్‌ను సంప్రదించాలని నిర్వాహకులలో ఒకరైన అంబటి శివ ప్రసాద్ తెలిపారు.

వన సమారాధన

సీతానగరం: మండలంలోని వంగలపూడి – రామచంద్రపురం గ్రామాల మధ్యలో గల మామిడి తోటలో బుధవారం వాసవీ ఆర్యవైశ్య సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో కార్తిక వన సమారాధన నిర్వహించారు. సంఘం అధ్యక్షుడు పజ్జూరి నాగేశ్వరరావు, కార్యదర్శి కంచెర్ల గోవిందరావు, కోశాధికారి గమిడి వెంకటేశ్వరరావు సమక్షంలో ఈ కార్యక్రమం జరిగింది. తొలుత సత్యనారాయణస్వామి వ్రతం, కన్యకా పరమేశ్వరి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. మండలంలోని ఆర్యవైశ్యులందరూ ఈ కార్యక్రమానికి తరలివచ్చారు. ఉదయం నుంచి సాయంత్రం వరకూ ఆటపాటలతో ఉత్సాహంగా గడిపారు.

గైట్‌లో ఫార్మసీ వారోత్సవాలు

రాజానగరం: జాతీయ ఫార్మసీ వారోత్సవాలలో భాగంగా గైట్ స్కూల్ ఆఫ్ ఫార్మసీ కళాశాలలో బుధవారం వైద్య శిబిరం జరిగింది. రాజమహేంద్రవరంలోని డెల్టా ఆస్పత్రి సహకారంతో నిర్వహించిన ఈ శిబిరంలో డాక్టర్ కె.రాజీవ్ కన్నన్ ఆధ్వర్యంలో మధుమేహం, రక్తపోటు, ఈసీజీ, బీఎంఐ పరీక్షలు చేశారు. శిబిరం నిర్వహణకు అనిల్ కుమార్, షేక్ మీరా సహకారం అందించారు.

గోతుల మయం

- అధ్వానంగా ఎయిర్ పోర్టు రహదారి
- అడుగడుగునా గోతులు
- ప్రయాణానికి తీవ్ర అవస్థలు



ఎయిర్ పోర్టు రోడ్డుపై బూరుగుపూడి వద్ద ఏర్పడిన గోతులు

మధురపూడి: ఉభయ గోదావరి జిల్లా వాసులకు ఎంతో ఉపయోగపడుతున్న విమానాశ్రయం రోడ్డు గోతులమయంగా మారింది. దానిపై రాకపోకలు ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. 516 ఇ జాతీయ రహదారిగా పిలువబడే ఈ రోడ్డును ఎప్పుడు అభివృద్ధి చేస్తారా అని ప్రజలు ఎదురుచూస్తున్నారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర రెడ్డి పాలనలో ఇది రాష్ట్రీయ రహదారిగా రూపాంతరం చెందింది. అనంతరం రాకపోకలు జోరుగా సాగేవి. ప్రస్తుతం గోతులమయంగా మారడంతో వాహనచోదకులు ప్రయాణానికి తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఈ రోడ్డు అభివృద్ధికి ప్రస్తుతం కూటమి ప్రభుత్వం ఎటువంటి చర్యలు తీసుకోలేదు.

ప్రయాణానికి అవస్థలు

జాతీయ రహదారిపై రాజమహేంద్రవరం నుంచి విమానాశ్రయం వరకూ అడుగడుగునా గోతులు ఏర్పడ్డాయి. రాజమహేంద్రవరం రూరల్ మండలం కొంతమూరు, కోలమూరు, కోరుకొండ మండలం గాడాల, మధురపూడి, బూరుగుపూడి గ్రామాల వరకూ 16 కిలోమీటర్ల పొడవున రహదారి ఉంది. ముఖ్యంగా శానిటోరియం, కొంతమూరు, గామన్ ఇండియా వంతెన పరిసర ప్రాంతం, కోలమూరు, కోరుకొండ మండలం గాడాల, మధురపూడి, బూరుగుపూడి గ్రామాల సమీపంలో రోడ్డు అధ్వానంగా మారింది. దీంతో ప్రయాణికులు సకాలంలో విమానాశ్రయానికి చేరుకోలేకపోతున్నారు.

మరమ్మతులు ప్రారంభించాలి



విమానాశ్రయం రహదారికి మరమ్మతులు నిర్వహించాలి. గోతుల కారణంగా ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎయిర్ పోర్టు వెళ్లే వారికి ఆలస్యమవుతోంది. ఈ రోడ్డులో పలు ప్రమాదాలు కూడా జరిగాయి.

– ఇందిగమెల్లి సత్యనారాయణ, మధురపూడి

రాత్రి వేళల్లో ప్రమాదాలు

ఈ రహదారిపై గోతుల కారణంగా పగటి సమయంలో రాకపోకలకు ఇబ్బంది కలుగుతున్నా, రాత్రి వేళల్లో మాత్రం ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇప్పటి వరకూ దాదాపు 21 మందికి గాయాలు కాగా, ఇద్దరు మృతి చెందారు. విమాన ప్రయాణం కోసం రాజమహేంద్రవరం, కాకినాడ, తాడేపల్లిగూడెం, నిడదవోలు, పోలవరం తదితర ప్రాంతాల నుంచి హైదరాబాద్, బెంగుళూరు, చెన్నై వెళ్లేందుకు ఈ రోడ్డు మీదుగా రాకపోకలు సాగిస్తారు.

రహదారిపై నీరు

వర్షం కురిసినప్పుడు రహదారిపై నీరు నిలిచిపోవడం వల్ల కూడా ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. కొంతమూరు శివారు, గామన్ ఇండియా వంతెన పరిసర ప్రాంతంలో నీరు రహదారిపైకి చేరుతోంది. కోలమూరు శివారు, గాడాల పొన్నాలమ్మ గుడి సమీపంలో చెరువు నుంచి నీరు రహదారి పైకి చేరి నిల్వ ఉంటోంది. దాని వల్ల వాహనాలు జారిపోవడంతో పాటు రోడ్డు కూడా దెబ్బతింటోంది.



ఎయిర్‌పోర్టు రహదారిపై నిలిచిన నీరు

టోల్ వసూలుకు చర్యలు

రహదారులపై ప్రయాణించే వాహనాల నుంచి టోల్ వసూలు చేయాలని కూటమి సర్కార్ ప్రణాళిక సిద్ధం చేసింది. ఇది అమలైతే ఈ రోడ్డుపై ప్రయాణించే వాహన చోదకులు తప్పకుండా టోల్ చెల్లించాలి. ఇప్పటికే గోతుల కారణంగా ఇబ్బంది పడుతున్న వాహన చోదకులకు ఇది అదనపు భారం కానుంది.

విజేతలకు బహుమతుల ప్రదానం



పెదపూడిలో విజేతకు సర్టిఫికెట్ అందజేస్తున్న ఎంఈఓ సత్యనారాయణ

పెదపూడి: విద్యార్థులు గ్రంథాలయాలను వినియోగించుకుని విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని మండల విద్యాశాఖాధికారి కె.సత్యనారాయణ అన్నారు. పెదపూడి మార్కెట్ సెంటర్లో గల గ్రంథాలయంలో 57వ గ్రంథాలయాల వారోత్సవాల ముగింపు సభ బుధవారం నిర్వహించారు. వ్యాసరచన, చిత్రలేఖనం, వకృత్వం, ముగ్గుల పోటీలలో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి వర్ధన్ తదితరులు పాల్గొన్నారు.



అనపర్తిలో విద్యార్థులకు సర్టిఫికెట్ల అందజేత

అనపర్తిలో..

అనపర్తి శాఖా గ్రంథాలయ పరిధిలో డీబీ జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు సభ నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయిని కల్యాణి గ్రంథాలయాల ప్రాముఖ్యత, ఉపయోగాలను విద్యార్థులకు వివరించారు. వివిధ పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి జి.అభిలాష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ముగిసిన గ్రంథాలయ వారోత్సవాలు

సీతానగరం: జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు కార్యక్రమాన్ని బుధవారం సీతానగరం గ్రంథాలయంలో లైబ్రేరియన్ టి.అరుణ్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు డిజిటల్ గ్రంథాలయంపై అవగాహన కల్పించారు. ముఖ్య అతిథులుగా ఎంఈవో కె.స్వామి నాయక్, విశ్రాంత హెచ్‌ఎం బి.భాస్కరరావులు హాజరయ్యారు. అనంతరం వివిధ పరీక్షల్లో విజేతలకుగా నిలిచిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలు, డిక్షనరీలు, దేశ నాయకుల చరిత్ర పుస్తకాలను అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎంవీవీ ప్రసాద్, జి.అశోక్, జి.శేఖర్, కె.విజయ్, బి.అరుణ పాల్గొన్నారు

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో..

సీతానగరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ డి.చిట్టిబాబు ఆధ్వర్యంలో గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థుల జీవితంలో గ్రంథాలయాలు ముఖ్యపాత్ర పోషిస్తాయన్నారు. వైస్ ప్రిన్సిపాల్ కె.హరేరామకృష్ణ మాట్లాడుతూ విద్యార్థులు సెల్ ఫోన్ల వినియోగాన్ని తగ్గించి, పుస్తక పఠనంపై అవగాహన పెంచుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పీవో డాక్టర్ ఎం.సుధామయి, డాక్టర్ పీవీ నాగేశ్వరరావు, డాక్టర్ మాధవ్, మీనాక్షి, వాణి పాల్గొన్నారు.



సీతానగరంలో బహుమతులు అందిస్తున్న ఎంఈవో స్వామినాయక్, విశ్రాంత హెచ్‌ఎం భాస్కరరావు

మేధో సంపత్తికి గ్రంథాలయాలు దిక్సూచి

రంగంపేట: మేధో సంపత్తికి గ్రంథాలయాలు దిక్సూచిగా ఉపయోగపడతాయని ఐసీడీఎస్ సీడీపీఓ జె.జెస్సీఫ్లోరెన్స్ అన్నారు. బుధవారం స్థానిక శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయాధికారి ఎస్.రామకోటేశ్వరరావు ఆధ్వర్యంలో 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు, బహుమతి ప్రదాన కార్యక్రమం జరిగింది. జెస్సీఫ్లోరెన్స్ మాట్లాడుతూ నేటి యువత గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకుని విజ్ఞానవంతులు కావాలన్నారు. పీహెచ్‌సీ వైద్యాధికారి బి.వేణుశ్రీలక్ష్మి మాట్లాడుతూ సమాజ వికాసానికి గ్రంథాలయాలు దోహదం చేస్తాయన్నారు. గ్రంథాలయాధికారి రామకోటేశ్వరరావు మాట్లాడుతూ గ్రంథాలయాల అభివృద్ధికి ప్రజల భాగస్వామ్యం అవసరమన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు దేశభక్తి గేయాలు ఆలపించారు. అనంతరం పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు అతిథులు బహుమతులు, ప్రశంసా పత్రాలు అందించారు. కార్యక్రమంలో ప్రభుత్వ కళాశాల అధ్యాపకులు పి.కృష్ణమూర్తి, పంచాయతీ కార్యదర్శి వి.శ్రీరామమూర్తి, సీఆర్పీ ఎల్.శ్రీనివాసరాజు, అంగన్వాడీ సూపర్ వైజర్ రమణాంజలి తదితరులు పాల్గొన్నారు.



పోటీల్లో విజేతలైన విద్యార్థులతో అధికారులు

తొలగించనున్న దేవాలయాల పరిశీలన

రంగంపేట: మండల పరిధిలోని ఏడీబీ రోడ్డు పక్కనే గల దేవాలయాలను బుధవారం తహసీల్దార్ యు.రంజిత్‌కుమార్ పరిశీలించారు. రోడ్డు విస్తరణలో భాగంగా ఎస్టీరాజాపురం, వడిశలేరు, రంగంపేట, కోటపాడు తదితర గ్రామాల్లో ఏడీబీ రోడ్డు పక్కన సుమారు 6 దేవాలయాలు తొలగించాల్సి ఉంది. ఈ దేవాలయాలకు నష్ట పరిహారం కొరకు ప్రతిపాదనలు పంపించాల్సి ఉన్నందున వాటిని పరిశీలించి స్థానిక గ్రామపెద్దలు, ఆలయ కమిటీ సభ్యులతో తహసీల్దార్ రంజిత్‌కుమార్ చర్చించారు. రోడ్డు విస్తరణ పనులు ప్రారంభం అయినందున త్వరలోనే నష్ట పరిహారం అందించి ఆలయాలను తొలగించనున్నారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.



రంగంపేటలో వేంకటేశ్వరస్వామి ఆలయాన్ని పరిశీలిస్తున్న రెవెన్యూ సిబ్బంది

ఘనంగా అయ్యప్ప పడిపూజ

పెదపూడి: సంపర గ్రామంలో బుధవారం రాత్రి ఘనంగా అయ్యప్ప స్వామి పడిపూజను నిర్వహించారు. గ్రామంలో రామాలయం వద్ద అయ్యప్ప మాలాధారణ గావించిన భక్తులు ఏర్పాటు చేసుకున్న పీఠం వద్ద పూజలు చేశారు. ప్రముఖ పండితుడు ఖండవిల్లి హనుమంతాచార్యుల అధ్వర్యంలో కార్యక్రమాలు జరిగాయి. అయ్యప్ప భక్తుల శరణుఘోషతో గ్రామం మార్మోగింది.

విద్యార్థులకు బహుమతుల ప్రదానం

బిక్కవోలు: మండలంలోని కొంకుదురు ఉన్నత పాఠశాలలో ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు అందించారు. బుధవారం నిర్వహించిన ఎఫ్‌టూ పరీక్షల్లో ప్రతిభ కనబరిచిన 6,8,10 తరగతుల విద్యార్థులకు పాఠశాల గణిత ఉపాధ్యాయుడు పడాల ఈశ్వరరెడ్డి బహుమతులు అందజేశారు.పాఠశాల హెచ్‌ఎం మల్లిపూడి శ్రీనివాస్ పాల్గొన్నారు.

గాలిని శుభ్రం చేసేద్దామా..

- వాయు కాలుష్యం నివారణకు కొత్త టెక్నాలజీ
- ఎన్‌సీఏపీ నిధులతో మెషీన్ కొనుగోలు
- కాలుష్య ప్రాంతాల్లో గాలిలోకి నీరు పిచికారీ

సీటీఆర్ఐ: ఆధునిక కాలంలో పట్టణ ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలలో కాలుష్యం ఒకటి. దీని కారణంగా అనేక అనారోగ్యాలు కలుగుతున్నాయి. వివిధ రకాల వ్యాధులతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సాధారణంగా పట్టణాల్లో వాహనాల రద్దీ బాగా ఎక్కువగా ఉంటుంది. పెద్ద భవనాలు, అపార్టుమెంట్లు, కాంక్రీట్ రోడ్లతో పచ్చదనం కనిపించదు. వాహనాల నుంచి వెలువడే పొగతో పాటు చెట్లు లేకపోవడంతో గాలిలో ఆక్సిజన్ శాతం తగ్గిపోతుంది. ప్రస్తుతం దేశ రాజధాని ఢిల్లీ కాలుష్య కోరల్లో చిక్కుకుంది. మన రాజమహేంద్రవరానికి కూడా త్వరలో ఆ పరిస్థితి రావొచ్చు. ఈ నేపథ్యంలో వాయు కాలుష్యం నియంత్రణకు నగరపాలక సంస్థ చర్యలు తీసుకుంది. గాలిని శుభ్రం చేయడానికి కొత్త మెషీన్‌ను తీసుకువచ్చింది.



మంచినీటిని గాలిలోకి వెదజల్లుతున్న మెషీన్

పెరుగుతున్న జనాభా

రాజమహేంద్రవరంలో జనాభా విపరీతంగా పెరిగిపోతోంది. విద్య, ఉద్యోగం, వ్యాపారం, జీవనోపాధి తదితర కారణాలతో నిత్యం అనేక మంది నగరానికి వలస వస్తున్నారు. ప్రముఖ వ్యాపార కేంద్రం కూడా కావడంతో వివిధ జిల్లాల నుంచి అనేక మంది దుస్తులు, బంగారం, వివిధ వస్తువులు కొనుగోలు చేయడానికి వస్తారు. దీంతో నగరంలో రోడ్లన్నీ ఎప్పుడూ రద్దీగానే ఉంటాయి. వాహనాలు విపరీతంగా పెరిగిపోవడంతో వాయు కాలుష్యం కూడా ఎక్కువవుతోంది. ప్రస్తుతం నగరంలో ఆరు లక్షల మందికి పైగా జనాభా ఉన్నారు.

కాలుష్య నియంత్రణకు కృషి

నగరంలో కాలుష్య ప్రాంతాలను గుర్తించి, అక్కడ వాహనంలోని మెషీన్ ద్వారా నీటిని వెదజల్లడానికి చర్యలు తీసుకుంటున్నాం. దాని కోసం ప్రత్యేకంగా షెడ్యూల్ రూపొందిస్తున్నాం. గాలిలో దుమ్ము బాగా ఉండే ప్రాంతాలలో నీటిని వెదజల్లుతున్నాం. నగరంలో కాలుష్య నియంత్రణకు సమష్టిగా కృషి చేయాలి.

– కేతన్ గార్గ్, కార్పొరేషన్ కమిషనర్, రాజమహేంద్రవరం

ప్రధాన కూడళ్లలో..

నగరంలోని అనేక ప్రధాన కూడళ్లు ఉన్నాయి. వాహనాల నియంత్రణ కోసం ఇక్కడ ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటు చేశారు. రెడ్ లైట్ పడినప్పుడు ఆ రోడ్డుపై వాహనాలు బారులు తీరుతాయి. కానీ వాటి ఇంజిన్లను ఆపకపోవడంతో దట్టమైన పొగ వెలువడుతూనే ఉంటోంది. దాని వల్ల కాలుష్యం పెరగడంతో పాటు వాహన చోదకులకు అనారోగ్యం కలుగుతోంది.

కాంక్రీట్ జంగిల్

రాజమహేంద్రవరంలో ఎక్కడ చూసినా అపార్టుమెంటులే కనిపిస్తున్నాయి. చెట్లను నరికివేసి, ఉన్న స్థలంలో కొంచెం కూడా వదలకుండా భవనాలు నిర్మిస్తున్నారు. దీంతో పచ్చదనం కనుచూపు మేర కనిపించడం లేదు. అక్కడక్కడా పార్కుల్లో మినహాయించి మిగిలినదంతా కాంక్రీట్ జంగిలే. స్వచ్ఛమైన ఆక్సిజన్‌ను ఇచ్చే చెట్లు లేకపోవడంతో గాలిలో కార్బన్ డయాక్సైడ్ పెరిగిపోతోంది. అనేక రుగ్మతులు తలెత్తుతున్నాయి.

గాలి నాణ్యత పెంచడానికి మెషీన్

నేషనల్ క్లీన్ ఎయిర్ ప్రోగ్రామ్ (ఎన్‌సీఏపీ)లో భాగంగా నగరంలో గాలి నాణ్యతను పెంచడానికి అన్ని చర్యలు తీసుకుంటున్నారు. దీనిలో భాగంగా ఎన్కాప్ నిధులతో వాటర్ స్ప్రింకిల్డ్ ఫాగ్ కొనన్ మిస్టింగ్ మెషీన్‌ను కొనుగోలు చేశారు. దీన్ని ఇటీవల నగర పాలక సంస్థ కమిషనర్ కేతన్ గార్గ్ ప్రారంభించారు. ఈ వాహనం ద్వారా మంచి నీటిని గాలిలోకి వెదజల్లుతారు. తద్వారా గాలిలోని కాలుష్యం తగ్గుతుంది. దుమ్ము, ధూళి, ఇతర కాలుష్య కణాలు నీటితో కిందకు పడిపోతాయి.

ఒక వాహనంపై ఈ మెషీన్‌ను ఏర్పాటు చేస్తారు. ముందుగా వేసుకున్న షెడ్యూల్ ప్రకారం వివిధ ప్రాంతాలకు ప్రతి రోజూ ఆ వాహనాన్ని తీసుకువెళతారు. అక్కడి నిలిపి నీటిని వెదజల్లుతారు. ఈ మెషీన్ నిరంతరాయంగా రెండు గంటల పాటు పనిచేస్తుంది.



వాటర్ స్ప్రింకిల్డ్ ఫాగ్ కొనన్ మిస్టింగ్ మెషీన్

స్నేహితుడిపై కత్తితో దాడి

సీతానగరం: చినకొండేపూడికి చెందిన చిడిపి రమేష్‌ను కత్తితో దాడి చేసిన జొన్నకుట్ల అన్వేష్‌పై కేసు నమోదు చేశామని ఎస్సై డి.రామ్ కుమార్ బుధవారం తెలిపారు. చినకొండేపూడిలో మంగళవారం రాత్రి స్నేహితులతో కలిసి ఉన్న రమేష్, అన్వేష్ మధ్య వివాదం తలెత్తింది. ఈ నేపథ్యంలో అన్వేష కత్తితో దాడి చేయగా రమేష్‌కు తలకు గాయమైంది. దీంతో అతడు రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఆసుపత్రి సమాచారం మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

తేనెటీగల దాడితో వ్యక్తికి గుండెపోటు

సీతానగరం: తేనెటీగల దాడి చేయడంతో గుండె పోటు వచ్చి ఓ వ్యక్తి మృతి చెందాడు. సీతానగరంలో బుధవారం ఈ ఘటన జరిగింది. వివరాల్లోకి వెళితే.. సీతానగరానికి చెందిన చిరువూరి వెంకటేశ్వరరావు (68) (బాబులు) వంగలపూడి మామిడి తోటలో జరుగుతున్న కార్తిక వన సమారాధనకు వెళ్లాడు. అక్కడ చెట్టుకున్న తేనెపట్టు చెదిరిపోవడంతో ఒక్కసారిగా తేనెటీగలు దాడి చేశాయి. దీనితో పలువురు పరుగులు తీశారు. బాబులు పరిగెత్తలేకపోవడంతో అతడిని తేనెటీగలు చుట్టుముట్టాయి. భయాందోళనకు గురైన అతడికి గుండెపోటు రావడంతో ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. అతడిని హుటాహుటీన సీతానగరంలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా అక్కడ మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతుడికి భార్య, కుమారుడు ఉన్నారు.

సిద్ధి వినాయకుడికి పంచామృతాభిషేకాలు



సంపరలో ప్రత్యేక అలంకరణలో సిద్ధి వినాయకుడు

పెదపూడి: సంపర గ్రామం పంటకాలువ సమీపంలో ప్రసిద్ధి చెందిన సిద్ధి వినాయకుడికి బుధవారం గరికపూజ, పంచామృతాభిషేకాలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు ఖండవిల్లి హనుమంతాచార్యుల ఆధ్వర్యంలో స్వామివారికి ప్రత్యేక పూలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు వచ్చి స్వామిని దర్శించుకున్నారు.

వాహనాలకు రేడియం స్టిక్కర్ల అతికింపు

మధురపూడి: శీతాకాలం కావడంతో పొగమంచు విపరీతంగా కురుస్తోంది. రహదారులపై వాహనాల రాకపోకలు అంతరాయం కలుగుతోంది. ముఖ్యంగా 516 ఇ జాతీయ రహదారిపై తెల్లవారుజాము సమయంలో ముందు వచ్చే వాహనాలు కనిపించడం లేదు. దీంతో ఈ రోడ్డుపై ప్రమాదాల నివారణకు పోలీసులు బుధవారం వాహనాలకు రేడియం స్టిక్కర్లు అతికించారు. కోరుకొండ సీఐ వై.సత్యకిషోర్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో వంద ద్విచక్ర వాహనాలతో పాటు, 40 లారీలు, ఆటోలు, కార్లు, వ్యాన్లకు ఈ స్టిక్కర్లు అతికించారు. సీఐ మాట్లాడుతూ జాతీయ రహదారిలో రోమ్ సిటీ పరిసరాల్లో పొగమంచు కారణంగా ముందున్న వాహనాలు కనబడటం లేదు. దీంతో ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. వాటి నివారణకు రేడియం స్టిక్కర్లు అతికిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో ఎస్సై శ్యామ్ సుందర్, సిబ్బంది పాల్గొన్నారు.

అతిథి ఉపన్యాసం



మాట్లాడుతున్న తెలుగు అధ్యాపకుడు రాజు

సీతానగరం: స్థానిక ప్రభుత్వం డిగ్రీ కళాశాలలో బుధవారం తెలుగు శాఖ ఆధ్వర్యంలో అతిథి ఉపన్యాసం కార్యక్రమం నిర్వహించారు. సాహిత్యం – సమాజం – అలరాస పుట్టిళ్లు అనే అంశంపై రాజమహేంద్రవరం ప్రభుత్వ అటానమస్ తెలుగు అధ్యాపకులు దాసరి రాజు ఉపన్యసించారు. సాహిత్యంలోని అనేక ముఖాలు సమాజంలోంచి పుట్టినవే అన్నారు. అలరాస పుట్టిళ్లు కథా రచయిత్రి కల్యాణ సుందరీ జగన్నాథ్ అత్యంత సునిశితంగా సమాజాన్ని పరిశీలించి కథను రాశారన్నారు. కార్యక్రమంలో తెలుగు అధ్యాపకురాలు డాక్టర్ ఎం.సుధామయి, విద్యార్థులు పాల్గొన్నారు.

మహిళపై నలుగురి దాడి

సీతానగరం: ఉండేశ్వరపురానికి చెందిన గెద్దం స్వర్ణలతపై దాడి చేసిన ఆకుమర్తి రాజు, కొల్లి వెంకటేష్, కొల్లి చంద్రరావు, ఆకుమర్తి వినోద్‌పై కేసు నమోదు చేశామని ఎస్సై డి.రామ్ కుమార్ బుధవారం తెలిపారు. చీటీల విషయంలో ఈ నెల 16న తలెత్తిన వివాదంతో ఈ ఘటన జరిగింది. స్వర్ణలత ప్రస్తుతం రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. ఆసుపత్రి సమాచారం మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

విద్యార్థులకు యూనిఫాం అందజేత

బిక్కవోలు: మండలంలోని పందలపాక శ్రీ పడాల పెద్దపుల్లారెడ్డి హైస్కూల్ విద్యార్థులకు పాఠశాల ఫౌండర్ పడాల కృష్ణారెడ్డి కుమారుడు పడాల ప్రవీణ్ రెడ్డి యూనిఫామ్స్ అందించారు. 30 మంది విద్యార్థులకు యూనిఫామ్స్ నిమిత్తం రూ.20వేలు, ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరాల విద్యార్థులకు రూ.25వేలు విలువగల స్టడీ మెటీరియల్స్‌ను అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం చిర్ల వీర్రాఘవరెడ్డి, పాఠశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ కొనాల సత్తిరాజు, పీడీ యువరాజారెడ్డి పాల్గొన్నారు.